# ఎన్నిక

హైద్రాబాద్ నుండి వచ్చిన వీడియోకోచ్‌లో నుంచి ఆ తెల్లవారుఝామున చలిలో శంకర్‌విలాస్ పక్కసందులో దిగి రిక్షా చేసుకొని బ్రాడీపేట చివరనున్న యింటికి చేరేటప్పటికి యింట్లో అప్పటికే వెలుగుతున్న దీపాలు, తెరిచి వుంచిన తలుపులు నా రాకకే ఆతురతతో ఎదురు చూస్తున్నట్లనిపించగా నాకు కించిత్ ఆశ్చర్యాన్నే కలిగించింది.

ఎందుకు పడుతున్నారు ఈ హడావుడంతా?

నిన్న సాయంత్రం నాలుగు గంటలప్పుడు ఆఫీసు అడ్రసుకు టెలిగ్రాం వచ్చింది "వెంటనే బయల్దేరు... విషయం జరూరు!" దాని సారాంశం అది.

ఆఫీసునుండి వస్తూ దారిలో అమీర్‌పేటలో దిగి టిక్కెట్లు పుచ్చుకొని మరీ రూంకు వెళ్ళాను.

నాకు రెండే కారణాలు కనిపిస్తున్నాయి- అందులో మొదటిది ఇంట్లో ఎవ్వరికో అనారోగ్యం, రెండోది నాకేదైనా పెండ్లి సంబంధం వచ్చివుండాలి... మొదటి కారణానికి అంత బలం లేదేమోననిపిస్తోంది- కారణం... రెండు రోజుల క్రితమే అంతా కులాసా అంటూ ఉత్తరం వచ్చింది... ఇక రెండో దానికి ఆదుర్దా పడవల్సిన అవసరంలేదు... నేను ఆడపిల్లను కాదు గనుక!

మరి ఎందుకీ టెలిగ్రాం?

తినబోతూ రుచి గురించి ఆలోచించడం దేనికి?

"సత్యం వచ్చాడేవ్!" అన్నయ్య కంఠంలో సంతోషం... అమ్మ వంటయింట్లో నుంచి బయటకు వచ్చింది. నాన్న మంచం మీద లేచి కూర్చున్నాడు. వదిన చిన్నచెంబుతో నీళ్ళు తెచ్చి కాళ్ళు కడుక్కోవటానికి గానూ మెట్లమీద పెట్టింది.

అంతయూ కులాసాయే!

-ఇక నాపెళ్ళే ఖాయమన్న మాట!

పెళ్ళి తప్పదూ అని ఖచ్చితంగా ఎందుకు అంటున్నాను అంటే- నన్ను చూచిన మా వదిన ముసిముసి నవ్వులే కారణం- ఆపైన ముఖం కడుక్కోవటానికిగానూ మరో చెంబుతో గోరువెచ్చని నీరు పెడుతూ "ఇక ఈ పనులన్నీ నాకు త్వరలోనే తప్పేలా వున్నాయిలేవయ్యా, మరిదీ!" అంటూ నవ్వేసింది.

"అర్థమయిపోయిందమ్మా, వదినా! చూస్తే పెళ్ళికి లగ్నాలు గూడా పెట్టేసినట్లున్నారు... కాబోయే చెల్లెలి పుట్టు పూర్వోత్తరాలు చెబితేనన్నా చెవులారా విని సంతోషిస్తాను!"

"అమ్మమ్మ! మామగారు వాకిట్లో తమరి కోసమే పడక కుర్చీలో చుట్ట త్రాగుతూ కూర్చొని వున్నారు... ఎంత తియ్యటి కొబ్బరి నీళ్ళయినా శంఖంలో నుంచి పోస్తేనే గదా తీర్థమయ్యేది!"

"నీకు దణ్ణం పెడతాను వదినా... ఆయనగారు చెప్పే పురాణానికి 'ఊ' కొట్టేయమంటావో... ఉడాయించేయ మంటావో... ముందు సూచనగా చెప్పేస్తే నా గుండె బరువు సగం తీరిపోతుంది ... ఆ అమ్మణీమణి ఇంతవరకు అన్ని పరీక్షలలోనూ వరసక్రమం తప్పకుండా పాసవుతూ వచ్చిందా? ఇదే ఆఖరిపరీక్షా?"

"నన్నడగబోకు తండ్రీ... నన్నడగబోకు... అది అటూఇటూ అయి అనుకున్న టైంలోగా నువ్వు ఆ మూడుముళ్ళూ వేయకపోతే ఆవిడగారు ఏదో నూరిపోసింది... ఈయనగారు బిగుసుకు కూర్చున్నారు- అని నన్నాడిపోసుకుంటారు... అసలే పరాయి అమ్మ కన్నబిడ్డను... నాకేల ఈ గోల!"

ఆవిడగారు నాకు పదేళ్ళప్పుడే వదినయి కూర్చున్నదేమో చనువు ఎక్కువ. అందుకే, "కాఫీ త్రాగి ముసలాయన ముందు చేతులు కట్టుకుని నిలబడేలోగా నేనేం చేయాలో చెప్పక పోతే గోడ దూకి పారిపోవటమే గాకుండా మా వదినమ్మకు నేను పెళ్ళిచేసుకోవడం యిష్టంలేదు- ఈ ఇంటి అజమాయిషీలో మరో మనిషికి చేయి పెట్టే అవకాశం యివ్వ గూడదనే పట్టుదలలోవున్నది- అని అడగనివాడికి ముందు అడిగినవాడికి వెనక చెబుతూ ఊరంతా తిరిగేస్తాను!"

"హత్తోస్మి! ఎవరన్నా వినేను... నిజమే అని నమ్మేసి నన్ను దుమ్మెత్తి పోస్తారు ... మీ అన్నగారు ఆ కసంతా తీర్చుకునేటందుకు నీకిచ్చి నన్ను ఏ అడవులకు పంపినా పంపవచ్చు!"

అమ్మ చెప్పింది, "నాన్న పిలుస్తున్నార్రా!" అని.

"కాఫీ ఇచ్చేదేమన్నా వున్నదా ?" కాస్త విసుగ్గా అన్నాను... ఆమె మీద కాదు ఆ కోపం... వదిన మీద...

"ఉల్లిపాయలు తరగవే వసంతా... ముందు రెండు ముక్కలు పెసరట్టులు వేసి పెడతాను!"

"అట్ల సంగతి, తిట్ల సంగతి తరువాత... ముందు కాసిని కాఫీ పోయి!"

"ఇదుగో వచ్చే!"

అటు ఇంకోసారి బయట నుంచి పిలుపు వచ్చింది అంటే ధూంధామే!... కాఫీతో నాలిక కాలుతున్నా... నన్ను దొంగచూపులు చూస్తూ వదిన నవ్వుతున్నా- సహిస్తూ త్వరత్వరగా త్రాగటానికే ప్రయత్నిస్తున్నాను.

"అన్నయ్యేడి!"

"పెద్దకొడుకు గదా... దశరథమహారాజు వారి కొలువులో ఉచితాసనులై వున్నారు!..."

"అమ్మా! సీతమ్మ తల్లీ... తలుపు వెనకాలైనా నువ్వు నిలబడరాదుటమ్మా... నాకు కాస్తంత ధైర్యం!"

"నేనెందుకు నాయినా మీ తండ్రీ కొడుకుల మధ్య... ఏం రహస్యాలు మాట్లాడుకుంటారో? ఏం నిర్ణయాలు తీసుకుంటారో? అయినా ఆడదాన్ని... వంటింటికే అంకితమవ్వ వల్సినదాన్ని... నాకెందుకీ సవాళ్ళు?"

సరిసరి- బయటపడ్డాను!

"రారా... కూర్చో... కులాసానా?... ఉద్యోగం ఎలా వున్నది?... హోటల్ తిండి బాగున్నదా?... ఆఫీసుకు సరిగ్గా వెళుతున్నావా? క్రితంసారి వచ్చినదానికంటే కాస్త తగ్గినట్లు కనిపిస్తున్నావు- రోడ్లమీద బలాదూరు తిరుగుడు ఎక్కువ అయిందా?" నాన్నగారు చుట్ట నోట్లో నుంచి తీస్తూనే ఒక్కసారి ఉమ్మేసి దండకం ప్రారంభించేశాడు.

గరుడసేవకే అన్నట్లుగా అన్నయ్య కూర్చున్నాడు.

"కులాసా... ఉద్యోగం బాగానేవున్నది... హోటల్‌తిండి బాగానేవున్నది... ఆఫీసుకు సరిగ్గానే వెళుతున్నాను... ఎండలెక్కువవ్వటంతో కాస్త తగ్గినట్లనిపిస్తుందవచ్చు గాని బలాదూర్‌గా రోడ్లమీద తిరగటం వలన కాదు!" అన్నయ్య పక్కనే మంచం మీద కూర్చుంటూ ప్రశ్నలన్నిటికి వరుసక్రమంలో సమాధానాలు చెప్పాను.

"ఇక్కడ రెండు సంబంధాలువున్నాయి... ఒకటి మనవీధిలోనే ఎలిమెంటరీ స్కూలు మేస్టారి మరదలి కూతురు... చామనచాయ... కాస్త పొట్టి... ఇంటరు పాసయింది... వాళ్ళది అమలాపురం... శలవల్లో వీళ్ళింటికి వచ్చింది. యిద్దరు తమ్ముళ్ళు. ఈ అమ్మాయి ఒక్కతే... కట్నం పదివేలకన్నా ఎక్కువ ఇవ్వలేకపోవచ్చు... ఇక రెండోది పీడబ్ల్యుడీ అసిస్టెంటు యింజనీరుగారి చెల్లెలి కూతురు... ఆ అమ్మాయి అన్నయ్య ఆరేళ్ళబట్టీ అమెరికాలో వుంటున్నాడు... అమ్మాయి ఎర్రగా పొడుగ్గా బాగుంటుంది... ఎమ్మే చదివింది... కట్నం ఇంత అని ఏమీలేదు... మనం ఎంతంటే అంతే... ఈ రెండూ ఇవ్వాళ నువ్వు చూసి ఏదో ఒకటి అనుకుంటే సరి– మేష్టారుగారి మరదలి కూతురు రేపు అమలాపురం వెళ్ళిపోతోంది... ఇక అమెరికా అబ్బాయి చెల్లెలి పెళ్ళిగనక ఖాయమైతే ఇంకోవారం వుండి చేసి వెళతాడు... లేకపోతే ఇవ్వాళ రాత్రికే బొంబాయి వెళ్ళిపోయి అటునుంచి అటు వెళ్ళిపోతాడు... సాయంత్రంలోగా మన నిర్ణయం చెప్పేయాలి... లోపలికెళ్ళి కాస్త టిఫిన్ తిని శుభ్రంగా తయారవ్వు... ఏరా పెద్దవాడా నువ్వూ లే... వసంతను, మీ అమ్మను గూడా బయల్దేరమను... పదిగంటలకు మాష్టారింటికి... మధ్యాహ్నం రెండుగంటలకు పిడబ్ల్యుడీ ఇంజనీరుగారింటికీ!" అది వన్‌వే ట్రాఫిక్...

దూడూబసవన్న లేచాడు.

ఇక నేను మాత్రం అక్కడ కూర్చొని చేసేదేమున్నది!

* * *

సరిగ్గా పదకొండుగంటలకు తిరిగి ఇంట్లో కాలు పెట్టాం. మధ్యాహ్నం రెండుగంటల వరకూ విశ్రాంతి.

వదిన నన్ను వంటరిగా నిలవేసింది.

"రాజేశ్వరి ఎలా వున్నదయ్యా!"

"ఏ రాజేశ్వరి?"

ఫక్కున నవ్వింది. "ఇప్పుడు చూసొచ్చిన పెళ్ళికూతురయ్యా బాబూ... పేరే మర్చిపోయావు అంటే పిల్ల నచ్చలేదన్న మాటే... ఎట్లాగయినా ఆ తండ్రి కొడుకువిగదా... ఆ అన్నకు తమ్ముడివి కాదా!"

తడబడటం నావంతే అయింది.

"తర్కంలో నిన్ను మించిన వారు లేరని నాకు ఎప్పుడో తెలుసుగాని నన్ను ఏడిపించబోకు!"

"నన్నేంపొగడనఖ్ఖర్లేదు... అమ్మాయి ఎలా వున్నదో చెప్పు!"

తల గోక్కున్నాను... ఎలా చెప్పాలి...

"సంసారపక్షంగా కుదురుగా వున్నది...పెద్దకళ్ళు... చక్కటి జడ... కాస్త రంగు తక్కువయితేనేం... చూడటానికి చాలా తెలివిగల దానిలాగానే కనిపిస్తున్నది!"

"నువ్వు ఎన్ని మార్కులు వేశావో చెప్పు వదినా... రెండుగంటలమ్మాయికిగూడా మార్కు లేద్దాం... ఎవరికెక్కువ వస్తే వాళ్ళు ఓకే అన్నమాట!"

వదిన ఫక్కున నవ్వింది.

"లెఖ్ఖల మాష్టారి పుత్రుడిననిపించు కున్నావయ్యా మరిదీ... మీ అన్నయ్య వేసిన లెఖ్ఖల్లో నాకెన్ని మార్కులొచ్చినయ్యో చెప్పమనరాదుటయ్యా సంతోషిస్తాను!"

"మొదటిమార్కు నీదేకదటమ్మా. అయినా మనలో మనమాట... ఇంకెవరితోనన్నా అనేవ్... వాడు లెఖ్ఖల్లో పండిత పుత్రుడు!" నేను బయటకు పరుగెత్తాను.

వదిన అన్నదే నిజం. అమ్మాయి కుదురుగా చక్కగా వున్నది... కాస్త రంగు తక్కువయితేనేం లక్ష్మీకళ కళ్ళల్లో ఉట్టిపడుతున్నది. ఆ పీడబ్ల్యుడి అసిస్టెంట్ యింజనీరుగారి చెల్లెలి కూతురి కేసు గనుక లేకపోతే రాజేశ్వరీ జిందాబాద్...

వక్కపొడి పొట్లానికి కంట్రోలర్ మా వదిన– మా అన్నయ్య తెగ తినేస్తుంటాడని– దాని వలన ఏ అల్సరో, కేన్సరో వచ్చేస్తుందనే భయంతో అన్నం తిన్న తరువాత అర్ధపలుకు శాంక్షన్‌చేస్తుంది... బయటకొనుక్కొని వేసుకుంటాడనే భయం వుండటంతో ఉదయం దంతావధానికి ముందే అలా చేయనూ అని వట్టేయించుకొని మరీ తలుపు తీసి బయటకు వెళ్ళనిస్తుంది.

వక్కపలుకు నా చేతిలో పెడుతూ, "రాజేశ్వరి త్యాగరాజకీర్తనలు బాగాపాడు తుందటయ్యా!" అన్నది నవ్వుతూ.

"స్టేజీమీదనా... పడకిటింట్లోనా?... మొదటిది సరేననుకోవచ్చు... రెండోచోటయితే ఖర్మ... త్యాగరాజకీర్తనలే వినాలా... దేవుడూ నన్నురక్షించు! అవును గాత్రం గూడా పాడేస్తుందా?"

తికమక పడిందని వదిన ముఖమే చెబుతోంది.

"ఆహాఁ... ఏమీలేదు వదినా... నువ్వేం కావాలన్నా మా అన్నయ్య గాత్రం పాడేస్తుంటాడు చూడు- అలా నేనేం కావాలన్నా..." నవ్వాను.

వదిన గుర్రురిమి చూసి వెళ్ళిపోయింది.

నేను వదల్లేదు. వెంటబడి వంట యింట్లోకి వెళ్ళాను.

"అలమర్లో పై అరలోవున్న బెల్లం డబ్బా కావాలా... అటక మీద అరిశల గరిటలు కావాలా?"

"నేను పొట్టిదాన్నని నువ్వేం ఎగతాళి చేయనఖ్ఖర్లేదు... విడివిడిగా చూస్తే మీ అన్నయ్య కంటే నేనే పొడుగంటారు తెలుసా!"

"ఖర్మ!... భుజాలు తడుముకోవటం ఆడవాళ్ళ దగ్గరే నేర్చుకోవాలి... ముందు రాజేశ్వరి సంగతి తేల్చేయ్ వదినా... నువ్వు 'ఓకే' అంటే మధ్యాన్నం పిడబ్ల్యుడీ యింజనీరుగారి చెల్లెల్ని 'నకో' అనేస్తాను నేను..."

మూతిని ముప్ఫయి ఆరు వంకర్లు తిప్పింది.

"అరిశలకు అంత తొందరపడితే ఎలాగయ్యా... గరిటలు దించు... అలాగేచేస్తా!" అన్నది నవ్వి.

* * *

మూడు గంటలకు ఎండమండిపోతుండగా ఇంట్లో కాలు పెట్టాం...

పీడబ్ల్యుడీ అసిస్టెంటు యింజనీరుగారింట్లో అయిస్క్రీం తిని శరీరాన్ని చల్లపరుచుకున్నా యింటికి రాగానే కూజా దగ్గర కూర్చోక తప్పలేదు.

ఆపైన ఆ అమ్మాయిని చూచింతరువాత నా మనస్సు కలవరపడ్డమాట వాస్తవం....

చిన్నప్పుడు బాబ్ చేయిస్తే కోపంకొద్దీ ఇక పెరగనన్నట్లుగా బెత్తెడుజడ... అది ఊడిపోతుందేమో నన్నట్లుగా యిరవై నాలుగు రంగు రంగుల క్లిప్పులు... బంగారమే వెలా తెలా పోతోందేమోనన్నంత పసుపురంగు శరీరం... లిప్స్టిక్కు అలవాటుపడి పోయిందేమో పండిన దొండ పండ్లలా ఎర్రని పెదాలు... సన్నగాపొడుగ్గా నాజుగ్గా వున్నది.

రాజేశ్వరి లావణ్యలలో ఎవరు బాగున్నారు, ఎవ్వరు బాగోలేరు అంటే చెప్పటం కాస్త కష్టమే! ఎవ్వరి అందం వారిది... నాకయితే నేను యిద్దరికీ సమానమైన మార్కులు వేసేస్తాను.

కళ్ళతోనే నవ్వింది మంచినీళ్ళు తాగుతున్న నన్ను చూస్తూ వదిన.

"చెప్పమ్మా వదినా... ఈ ఇద్దరిలో నీ చెల్లెలెవరు?"

"నీ కాబోయే భార్యే నా చెల్లెలు!"

"నన్ను చంపక చెప్పేస్తే బెంగుళూరు సిల్కు చీర ఖాయం!"

"చెప్పకపోతేనో?"

"చీరకు గాత్రమే!"

"బాబోయ్... అయితే తప్పదన్నమాట... సరే ఏం చేస్తాం... నీ మార్కుల లెక్క తీయి ముందు!"

"సమానంగా వచ్చినయి!"

"హతోస్మి... కొంపలంటుకున్నయ్యన్నమాటే... రూపాయిబిళ్ళ ఇలా పట్రా... తలా తోకా?" నవ్వింది.

"నీకు నవ్వుగానే వుంటుంది... మధ్యలో నేను చస్తున్నాను!"

"లక్ష్మీ అమ్మవారు కావాలో, లక్క పిడత కావాలో తేల్చుకోవలసింది నువ్వు... మంచి కావాలో, డబ్బే కావాలో తేల్చుకోవాల్సింది మీ నాన్న... పనిమంతురాలు కావాలో, సవాళ్ళు తీసేవాళ్ళు కావాలో తేల్చుకోవాల్సింది మీ అమ్మ ... కార్లలో తిరిగే మరదలు కావాలో, కాలినడకన తిరిగే మరదలు కావాలో తేల్చుకోవాల్సింది మీ అన్నయ్య... మల్లెలన్నా మధురవాక్కులన్నా ప్రేమించే మీ వదినకు సరితూగే చెల్లెల్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఒక నీది... నాదేమున్నదయ్యా... రాబోయే అమ్మాయికంటే పదిరోజుల ముందు ఈ ఇంటికి వచ్చినదాన్ని నేను!"

"నేను పెళ్ళే చేసుకోను వదినా!"

"అస్సలు చేసుకోవా... యిద్దర్లో ఎవ్వరినీనా?"

"ఈ అమ్మాయి నీకు అందమయిన జోడీగా వుంటుందయ్యా అని నువ్వు చెప్పేంత వరుకూ నా పెళ్ళిమాట మాత్రం ఎవ్వరూ ఎత్తవద్దు!"

"నాన్న పిలుస్తున్నాడురా!" అమ్మ తలుపవతల నుండే చెప్పింది.

"మన చేతుల్లో ఏమున్నదయ్యా... మనం ప్రేక్షకులం మాత్రమే... అన్నీ చేయించేవాడు బయట వరండాలో తాపీగా కూర్చొని చుట్ట ముట్టించాడు... ఆపైన నీకోసమే ఖబురంపాడు... ఆయన చెప్పింది చేయడమే నీ కర్తవ్యం!"

ఉక్రోషంగా చూశాను ఆమెను.

"మా బాబువిగదూ ఇలారా... కోప్పడబోకు... కోటివీణలు పలికే కొత్తజీవితాన్ని ఎన్నుకోవాలీ అంటే ఎవరో చెప్పినమాట వినటం గాదు... మనకు మనం ఆలోచించు కోవాలి... పోయిరా!"

"అయితే నువ్వు చెప్పవు!"

"నీకు ఎవ్వరు నచ్చారో చెప్పు!"

"అది తెల్చుకోలేకేగదా నిన్నడగటం!"

"నీకు మనస్సు లేదా... ఆలోచించే శక్తి లేదా?"

గొణుక్కుంటున్నట్లుగా అన్నాను "లావణ్య మనిషి బాగున్నది... నీమాటల్ని బట్టి రాజేశ్వరి మనస్సు బాగున్నది!"

"మనస్సుకు మార్పుండదు... రూపెంతకాలం... మహా అయితే యిద్దరు పిల్లలు పుట్టేటంత వరకు!"

వదిన ఓటెటో చాలా స్పష్టంగా చెప్పినట్లే!

నేను బయటకు వచ్చేశాను.

"రారా సత్యం... రా... రాత్రికి హైద్రాబాద్ వెళ్ళేటందుకుగాను టిక్కెట్ రిజర్వు చేయించుకో... మీ ఆఫీసరుకు చెప్పి ఓ పదిహేను రోజులు శలవు పెట్టి వచ్చేసేయ్... పెళ్ళికిముందు నీడపట్టున కూర్చొని యింటి భోజనంచేయి... యిక సంబంధాల విషయానికొస్తే- మేష్టారి మరదలు కూతురికంటే పీడబ్ల్యుడీ యింజనీరుగారి చెల్లెలు కూతురే అన్నివిధాలా మెరుగ్గా వున్నది... చదువుకు చదువున్నది... కుటుంబంలోని వాళ్ళంతా మంచి హోదాల్లో వున్నారు. అడిగినంత కట్నం ఇస్తామన్నారు... అమ్మాయి అన్నయ్య అమెరికాలో వున్నాడు... నీకా డబ్బుకు కొదవ వుండదు... భవిష్యత్తు బాగుంటుంది... ఆ అమ్మాయినే నిర్ణయం చేస్తున్నాను... మీ అమ్మకు గూడా నచ్చింది... కనుక పెద్దవాడా!

నువ్వు వెంటనే బయిల్దేరు... మాష్టారి సంబంధం తెచ్చిన చలపతింటికి వెళ్ళి వాళ్ళు అమలాపురం వెళ్ళిపోవచ్చు, సంబంధం నచ్చలేదుట అని చెప్పేయమని చెప్పేశేయ్. ఆపైన శాస్త్రిగారింటికి వెళ్ళి పీడబ్ల్యూడీ యింజనీరు గారితో చెప్పి రమ్మనమను... అమ్మాయి నచ్చింది... మిగతా విషయాలు మాట్లాడు కొని లగ్నాలు పెట్టుకునేటందుకు రమ్మనమని... అంతా సాయంత్రంలోగా అయిపోవాలని చెప్పేశేయ్... నాకు నాన్చటం యిష్టముండదు... వీడు తొమ్మిది గంటల బస్సుకు హైద్రాబాద్ వెళుతున్నాడు... అప్పటిలోగా లగ్నం నిర్ణయమైపోతే అక్కడ చెప్పాల్సిన నలుగురికీ చెప్పేసి లీవు పెట్టి మళ్ళీ ఎల్లుండి వచ్చేస్తాడు... సరేనా... ఏరా మూగమొద్దులా అలాకూర్చున్నావ్... సరేనా... ఊఁ అను!" రైలు యింజన్లోనుంచి వస్తున్నట్లుగా అయన నోట్లోనుంచి చుట్టపొగ వస్తున్నది...

నా మనస్సు రైలు యింజన్‌లా కుతకుతలాడిపోతున్నది!

* * *

నాన్న చెప్పిందంతా విని తల ఊపి వెళ్ళిన అన్నయ్య గంట తరువాత వచ్చాడు.

వస్తూనే మెట్ల దగ్గర చెప్పులిడిచి, పడక కుర్చీలో కూర్చున్న నాన్న ఎదుట నిల్చున్నాడు.

"మాష్టారుకి వాళ్ళమ్మాయిని అమలాపురం పంపేయవచ్చని ఖబురు పెట్టమని చలపతిగారికి చెప్పాను... శాస్త్రిగారింటికి వెళ్ళితే అంతకు ముందే అమెరికా అబ్బాయి వచ్చి వెళ్ళాడుట వాళ్ళింటికి. ఆ అమ్మాయికి మనవాడు నచ్చలేదట... ఆయన బొంబాయికి వెళ్ళి పోతున్నాడట ఈ సాయంత్రం!"

నాన్నకు ఎదురు చెప్పలేక దిగులుగా వెనక గదిలో కిటికీ పక్కగా కూర్చొని చూస్తున్న నేను అన్నయ్య మాటలకు ఉలిక్కిపడ్డాను.

ఆ క్షణంలోనే-

ఎదురుగ్గా నిల్చొని నావైపే జాలిగా చూస్తున్న వదిన కళ్ళల్లో ఓ క్షణం చిన్న మెరుపొకటి తళుక్కుమన్నది!

* * *

*(స్వాతి సపరివార పత్రిక: 13.12.1985)*